క్లుప్తంగా...

కిష్టాపూర్‌లో సీసీ రోడ్డు పనులు ప్రారంభం



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న చైర్ పర్సన్ దీపికారెడ్డి

మేడ్చల్: పట్టణంలోని 4వ వార్డు కిష్టాపూర్‌లో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను మున్సిపల్ చైర్ పర్సన్ దీపికనర్సింహారెడ్డి కౌన్సిలర్ తుడుం గణేష్‌తో కలిసి ప్రారంభించారు. వార్డు పరిధిలోని బంగారు మైసమ్మగుడి నుంచి రూ.10 లక్షలతో నిర్మిస్తున్న సీసీ పనులకు ఆము పూజా కార్యక్రమాలు నిర్వహించి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఇంద్రారెడ్డి వార్డు నాయకులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా ఘట్‌కేసర్ వాసులు




ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి ఎంపీటీసీ శోభారాణి

ఘట్‌కేసర్: బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా ఘట్‌కేసర్ మండల పరిషత్ అధ్యక్షుడు ఏనుగు సుదర్శన్‌రెడ్డి, అంకుషాపూర్ ఎంపీటీసీ కొమ్మిడి శోభారాణి ఎంపికయ్యారు. ఈ మేరకు బీజేపీ తెలంగాణ రాష్ట్ర చీఫ్ బండి సంజయ్ వారిని ఎంపిక చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమపై బాధ్యత మరింత పెరిగిందన్నారు. పలువురు వారికి అభినందనలు తెలిపారు.

మేడ్చల్ విద్యుత్ టీమ్‌కు సీఎండీ అభినందనలు



ప్రశంసాపత్రం అందజేస్తున్న విద్యుత్ శాఖ సీఎండీ ప్రభాకర్‌రావు

మేడ్చల్: లక్ష్యాన్ని చేరుకోవడంలో ప్రతిభ కనబర్చిన మేడ్చల్ విద్యుత్ సర్కిల్ టీమ్‌ను సంస్థ సీఎండీ ప్రభాకర్‌రావు అభినందించారు. సంస్థ విధించిన టార్గెట్లను మూడేళ్లుగా జీహెచ్ఎంసీ సర్కిళ్లలో మేడ్చల్ సర్కిల్ ప్రథమ స్థానంలో ఉండటంతో ఆయన ఉద్యోగులను అభినందించి ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఇదే స్ఫూర్తి కొనసాగించాలన్నారు. సీఎండీని కలిసిన వారిలో డీఈ శ్రీరాం మోహన్, అధికారులు శ్రీనాథ్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, చక్రవర్తి, నర్సింహారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, మోహన్ ఉన్నారు.

'పల్లె ప్రగతి' ఏర్పాట్లపై ఆరా



గోధుమకుంటలో పర్యటిస్తున్న ప్రత్యేక అధికారి నాగేశ్వరరావు

కీసర: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ఈ నెల 15న నిర్వహించే పల్లె ప్రగతి ప్రత్యేక కార్యక్రమాల సందర్భంగా గోధుమకుంట గ్రామంలో చేపట్టిన ఏర్పాట్లను మంగళవారం కమిషనర్ పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ కార్యాలయం నుంచి విచ్చేసిన ప్రత్యేక అధికారి నాగేశ్వరరావు పరిశీలించి పలుసూచనలు చేశారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ స్మిత, సర్పంచ్ ఆకిటి మహేందర్‌రెడ్డి, గ్రామకార్యదర్శి సురేష్‌రెడ్డి, ఉపసర్పంచ్ ఆంజనేయులు, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య



నాగరాజు

కీసర: కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ రఘువీర్‌రెడ్డి వివరాల ప్రకారం.. అహ్మద్‌గూడలోని రాజీవ్ గృహకల్ప కాలనీవాసి నాగరాజు(35) ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం రాత్రి భార్య జ్యోతి ఇంట్లో లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ కలహాలతోనే మృతుడు ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతుడికి ముగ్గురు పిల్లలున్నారు. కొడుకు రాకేష్ 9వ తరగతి, కూతుళ్లు రిషిక 8వ తరగతి, సిరి 3వ తరగతి చదువుతున్నారు. వీరి సొంత ప్రాంతం మహబూబ్‌నగర్ టౌన్ అని తెలిసింది.

పట్టణ ప్రగతికి నిధులెక్కడ..?

- మూడు నెలలుగా నిధుల జాడ కరువు
- మూడేళ్ల క్రితం ప్రవేశ పెట్టిన పథకానికి నిధుల గ్రహణం
- శివారు పురపాలికల్లో నిలిచిపోయిన అభివృద్ధి పనులు



సాక్షి, మేడ్చల్ జిల్లా: పురపాలక సంఘాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అమలు చేస్తున్న పట్టణ ప్రగతి పనులకు నెలలు గడిచినా నిధులు విడుదల కావడం లేదు. నగర శివారు జిల్లాల్లో 28 పురపాలక సంఘాల్లో మూడు నెలల నుంచి నిధులు రాకపోవడంతో.. ఆ నిధుల విడుదలకు ఎప్పుడు మోక్షం లభిస్తుందోనని ఎదురు చూస్తున్నాయి. 15వ ఆర్థిక సంఘం ద్వారా ఒక్కో పురపాలక సంఘానికి ప్రతినెలా రూ.3 లక్షల నుంచి రూ.21 లక్షల వరకు నిధులు విడుదలవుతున్నాయి. మూడు నెలలుగా నిధులు విడుదలకాకపోవడంతో చేసిన పనుల బిల్లుల కోసం వస్తున్న వారికి జవాబు చెప్పలేక మున్సిపల్ అధికారులు సందిగ్ధంలో పడుతున్నారు. ప్రతిపాదించిన పనులను నిర్ణీత గడువు లోగా పూర్తి చేయాలని ఉన్నతాధికారులు ఒత్తిడి తెస్తుంటే పూర్తయిన వాటికి బిల్లులు చెల్లించనిదే పనులెలా చేస్తారని పురపాలక వర్గాలు పేర్కొంటున్నాయి.

3 నెలలు దాటినా..

పట్టణాల్లో చేపట్టిన పనులకు ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లించేందుకు కేంద్ర ప్రభుత్వ నిధులతో సమానంగా రాష్ట్ర ప్రభుత్వం నిధులు జమ చేసి ప్రతినెలా బిల్లులు చెల్లించేందుకు తెలంగాణ ప్రభుత్వం 2020లో ఈ పథకాన్ని తీసుకొచ్చింది. జనాభా ప్రాతిపదికన పురపాలక సంఘాలకు ఎన్ని నిధులు కేటాయించాలో ముందుగానే నిర్దేశించి ఆ మేరకు పనులను ప్రతిపాదించేవారు. పూర్తి చేసిన పనులకు వందశాతం నిధులు వెంటనే విడుదలయ్యేవి. 2021 ఆగస్టు నుంచి పట్టణ ప్రగతి నిధుల్లో సుమారు 25 శాతం నిధులకు కోత విధించింది. మిగిలిన 75 శాతం నిధులను కూడా క్రమం తప్పకుండా విడుదల చేయడం లేదు. ప్రతినెలా పట్టణ ప్రగతికి నిధులు మంజూరవుతాయనే ప్రణాళికాబద్ధంగా ఆ పథకం ద్వారా వివిధ పనులను చేయిస్తున్నామని మున్సిపల్ అధికారులు పేర్కొంటున్నారు. మూడు నెలలుగా నిధులు విడుదల కాకపోవటంతో కొన్ని ఇబ్బందులు తప్పడం లేదంటున్నారు.

రాష్ట్రంలో వైద్యరంగం ప్రగతిని వివరించండి

జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్

సాక్షి, మేడ్చల్ జిల్లా: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం తెలంగాణ వైద్యారోగ్య దినోత్సవాన్ని మేడ్చల్ జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో వైద్య రంగంలో నూతనంగా వచ్చిన సేవలను వివరించాలని ఆయన సూచించారు. కేసీఆర్ కిట్, న్యూట్రీషన్ కిట్, సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులతో పాటు వైద్యారోగ్య శాఖ సిబ్బంది, నూతన మెడికల్, నర్సింగ్, పారామెడికల్ కాలేజీల విద్యార్థులను ఆహ్వానించి పెద్ద ఎత్తున సభ నిర్వహించాలన్నారు. ఇందులో రాష్ట్రం ఏర్పడక ముందు నాటి పరిస్థితులను.. ప్రత్యేక రాష్ట్రం వచ్చిన తర్వాత ప్రస్తుతం వైద్యారోగ్య రంగంలో సాధించిన ప్రగతిని తెలియజేయాలన్నారు. జిల్లావ్యాప్తంగా ఉన్న మెడికల్ కాలేజీలు, బస్తీ దవాఖానాలు, పల్లె దవాఖానాలు, కంటి వెలుగు, న్యూట్రీషన్ కిట్లు, కేసీఆర్ కిట్లు, ఎంసీహెచ్‌లు, మాతా శిశు సంరక్షణ సేవలు, పెరిగిన మౌలిక వసతులు వంటి పూర్తి సమాచారాన్ని అందించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ శ్రీనివాస్‌కు సూచించారు. ఉత్తమ ఏఎన్ఎం, ఉత్తమ స్టాఫ్ నర్స్, ఉత్తమ ల్యాబ్ టెక్నీషియన్, ఉత్తమ డాక్టర్లను అవార్డులతో సత్కరించాలని ఆయన అధికారులను ఆదేశించారు.

ఐటీఐలో చేరేందుకు 19లోపు దరఖాస్తు చేసుకోవాలి

మేడ్చల్: ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలో చేరేందుకు ఈ నెల 19 తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శైలజ తెలిపారు. గడువు తేదీని 10 నుంచి 19 వరకు పొడగించినట్లు ఆమె తెలిపారు. ఏడాది కోర్సులైన డీజిల్ మెకానిక్, వెల్డర్, రెండు సంవత్సరాల కోర్సులైన ఫిట్టర్, ఎలక్ట్రీషన్, ఎలక్ట్రానిక్స్ వంటి ట్రేడ్‌లలో చేరేందుకు ఈనెల 19వ తేదీలోపు పదో తరగతి పాసై, 14 సంవత్సరాలు నిండిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. సందేహాలు, సలహాల కోసం మేడ్చల్‌లోని ప్రభుత్వ ఐటీఐలో సంప్రదించాలని కోరారు.

వర్షాకాలంలో సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి



మేనేజర్‌కు వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

మేడ్చల్: రాబోయే వర్షాకాలంలో మేడ్చల్ పట్టణంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని బీజేపీ పట్టణ నాయకులు మున్సిపాలిటీ మేనేజర్‌కు మున్సిపల్ కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. చాలా వరకు బస్తీల్లో డ్రైనేజీ వ్యవస్థ, రోడ్లు సరిగా లేవని, వాటికి మరమ్మతులు చేపట్టాలని కోరారు. పాత ఇళ్ల వారికి ముందుగా సమాచారం ఇవ్వాలని, వరద నీరు వెళ్లే కాల్వలను శుభ్రం చేయాలని, అన్ని ముందస్తు చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, కిషన్‌రావు, ప్రేందాస్, ఈశ్వర్, మైసరి రాజు, టైలర్ రాజు, లక్ష్మణ్, వంశీధర్‌రెడ్డి, రాఘవరెడ్డి, వంశీవంజరి, కేశవరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, అర్జున్, నర్సింగ్‌రావు, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



కొండాపూర్‌లో వైద్యశిబిరాన్ని పర్యవేక్షిస్తున్న పావనీయాదవ్, మాధవరెడ్డి

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలోని కొండాపూర్‌లో మెడిసిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా మున్సిపల్ చైర్ పర్సన్ పావనీయాదవ్, వైస్ చైర్మన్ మాధవరెడ్డి హాజరై వైద్యశిబిరం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైద్య శిబిరంలో బీపీ, షుగర్, ఈసీజీ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ శశికళ, మాజీ ఎంపీటీసీ గోపాల్‌రెడ్డి, వైద్యులు బీన్ రెడ్డి, శోభ, కల్పన, స్థానికులు పాల్గొన్నారు.

అవుషాపూర్‌లో పాఠ్యపుస్తకాల పంపిణీ

ఘట్‌కేసర్: అవుషాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ కావేరిమశ్చేందర్‌రెడ్డి హాజరై పాఠ్యపుస్తకాలను అందజేశారు. ప్రధానోపాధ్యాయులు రవి, వార్డు సభ్యులు కుశలవరెడ్డి, మల్లేశ్, నాయకులు వెంకట్‌రెడ్డి, మశ్చేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



అవుషాపూర్‌లో పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ కావేరి, మశ్చేందర్‌రెడ్డి

డిగ్రీ కళాశాల కోసం మంత్రికి వినతి పత్రం

మేడ్చల్: ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఈ సంవత్సరం మేడ్చల్‌కు మంజూరు చేయించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ నాయకులు మంత్రి మల్లారెడ్డికి వినతి పత్రం సమర్పించారు. మేడ్చల్ పర్యటనకు వచ్చిన మంత్రిని ఎస్ఎఫ్ఐ నాయకులు కలిసి వినతి పత్రం అందజేశారు. మంత్రి గురుకులాల పేరిట తప్పించుకునే మాటల మాట్లాడుతున్నాడని, మేడ్చల్‌కు డిగ్రీ కళాశాల తీసుకురాకపోతే ఆయనకు వ్యతిరేకంగా ఎన్నికల్లో ఎస్ఎఫ్ఐ నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేస్తారని జిల్లా ఎస్ఎఫ్ఐ కార్యదర్శి రాథోడ్ సంతోష్ తెలిపారు. వినతి ప్రతం అందజేసిన వారిలో మండల ఎస్ఎఫ్ఐ కార్యదర్శి కిరణ్, నాయకుడు ఆదిల్ మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

కోనాయిపల్లిలో స్ట్రీట్‌లైట్స్ ప్రారంభం

మండలంలోని కోనాయిపల్లి గ్రామంలో మంత్రి మల్లారెడ్డి మంగళవారం వీధి దీపాలను ప్రారంభించారు. గ్రామంలో ఆయన పర్యటించి నూతనంగా ఏర్పాటు చేసిన స్ట్రీట్ లైట్లను ప్రారంభించారు. నూతనంగా నిర్మించి ప్రతిష్ఠించి నల్లపోచమ్మ విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్నారు. ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి, సర్పంచ్ శేఖర్, నాయకులు భాగ్యారెడ్డి, సురేష్‌రెడ్డి, యూనుస్ పాషా, భాస్కర్‌యాదవ్, దయానంద్‌యాదవ్, విజయానంద్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, జీవన్‌బాబు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ మద్దుల లక్ష్మి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నీలో మంగళవారం మంత్రి మల్లారెడ్డి పాల్గొన్నారు. కొద్దిసేపు క్రికెట్ ఆడి ఫైనల్‌లో తలపడే జట్లను అభినందించి మ్యాచ్‌ను ప్రారంభించారు.

వినియోగదారుల ఫోరం జిల్లా అధ్యక్షుడిగా లక్ష్మీనారాయణ



శామీర్‌పేట్: వినియోగదారుల ఫోరం మేడ్చల్ జిల్లా అధ్యక్షుడిగా లక్ష్మీనారాయణ నియమితులయ్యారు. మంగళవారం మేడ్చల్ మండలం పూడూరు గ్రామ పరిధిలోని అయ్యప్ప స్వామి ఆలయ ప్రాంగణం వద్ద వినియోగదారుల ఫోరం సమావేశం నిర్వహించారు. అనంతరం మేడ్చల్ జిల్లా వినియోగదారుల ఫోరం మేడ్చల్ జిల్లా అధ్యక్షుడిగా దేవరయంజాల్‌కు చెందిన లక్ష్మీనారాయణను నియమించారు. ఈ మేరకు జాతీయ కన్వీనర్ సింబల్ రాథోడ్ నియామకపత్రాన్ని అందజేశారు.

రెండోరోజూ కీసర సర్వసభ్య సమావేశం వాయిదా

కీసర: కోరం లేని కారణంగా కీసర మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం రెండోసారి వాయిదా పడింది. వివరాల్లోకి వెళ్లితే మంగళవారం ఎంపీపీ ఇందిరాలక్ష్మీనారాయణ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ప్రారంభం కాగా మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన సర్పంచులు, కొన్ని శాఖల అధికారులు సమావేశానికి హాజరయ్యారు. వైస్‌ఎంపీపీ జె.సత్తిరెడ్డితో పాటు, మిగిలిన ఆరుగురు ఎంపీటీసీ సభ్యులు ఎవరూ హాజరుకాలేదు. దీంతో సమావేశాన్ని నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీఓ వాత్సల్యదేవి తెలిపారు.

విద్యార్థుల మధ్య గొడవ

శామీర్‌పేట్: కళాశాల విద్యార్థుల మధ్య గొడవలో బయటి వ్యక్తులు తలదూర్చడంతో పెద్దగొడవగా మారింది. వివరాల్లోకి వెళ్తే.. తూంకుంట మున్సిపాలిటీలోని విశ్వవిశ్వాని కళాశాలలో చదువుతున్న ధీరజ్, అదే కళాశాలలో చదువున్న చరణ్‌తో మాట్లాడుతున్నాడు. అదే సమయంలో మరో విద్యార్థి వివేక్ అక్కడికి వచ్చి చరణ్‌ను తీసుకెళ్తుండగా బాధితుడు ధీరజ్ అడ్డుకున్నాడు. దీంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. విషయం తెలుసుకున్న యశ్వంత్, శశి, వివేక్, విఘ్నేష్ అనే విద్యార్థులతో పాటు సుమారు 30 మంది బయటి వ్యక్తులు కొట్టుకున్నారు. లాలూగౌడ్ అనే వ్యక్తి ధీరజ్ తలపై ఇటుకతో దాడి చేయగా తీలకు తీవ్రగాయమైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు శామీర్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ అదృశ్యం



గౌసియా(ఫైల్)

జవహర్‌నగర్: ఓ మహిళ అదృశ్యమైన ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాలాజీనగర్ సిటిజన్ కాలనీలో షేక్ గౌసియా(35) కుటుంబ సభ్యులతో కలిసి నివసిస్తోంది. ఈ నెల ఆమె ఇంటి వెళ్లి తిరిగిరాలేదు. దివ్యాంగురాలైన ఆమె కోసం కుటుంబసభ్యులు వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళల సంక్షేమానికి ఎన్నో పథకాలు

మంత్రి మల్లారెడ్డి



మేడ్చల్ మండల పరిషత్ కార్యాలయంలో మహిళలను సన్మానిస్తున్న మంత్రి మల్లారెడ్డి

మేడ్చల్: మహిళా సంక్షేమంలో మన రాష్ట్రం దేశానికే ఆదర్శమని మంత్రి మల్లారెడ్డి అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మహిళా సంక్షేమ దినోత్సవంలో మహిళా సంబురాల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో మహిళల సంక్షేమం కోసం ఏ రాష్ట్రంలో అమలు కాని సంక్షేమ పథకాలను రాష్ట్రంలో సీఎం కేసీఆర్ అమలు చేస్తున్నారని అన్నారు. ఆడపడుచులు గుక్కెడు నీటి కోసం బిందెలు చేతపట్టుకుని బయటకు వెళ్లే పరిస్థితి నుంచి ఇంటింటికీ మిషన్ భగీరథ నీరిచ్చిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదే అన్నారు. మహిళలకు అన్ని రంగాల్లో రిజర్వేషన్ అమలు చేస్తున్న ఘనత తమదేనన్నారు. అప్పుడే పుట్టిన శిశువు నుంచి 60 ఏళ్ల వారి వరకు అందరికీ ప్రభుత్వం అండగా ఉందన్నారు. కల్యాణ లక్ష్మి పథకంతో బాల్యవివాహాలను పూర్తిగా అరికట్టామని, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలకు దేశంలో అత్యధికంగా పారితోషకాలు ఇచ్చి గౌరవం కల్పించామన్నారు. మహిళలను సన్మానించి అవార్డులు అందజేసి స్టాళ్లను తిలకించారు. జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, రైతుబంధు జిల్లా కన్వీనర్ నందారెడ్డి, ఎంపీపీలు రజిత రాజమల్లారెడ్డి, ఎల్లుబాయి, హారిక మురళీగౌడ్, జెడ్పీటీసీ శైలజవిజయానంద్‌రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ దీపికనర్సింహారెడ్డి, వైస్ ఎంపీపీ వెంకటేషం, జిల్లా పరిషత్ సీఈఓ దేవసహాయం, ఐసీడీఎస్ సీడీపీఓ ఉదయశ్రీ, ఎంపీడీఓ పద్మావతి, సూపర్‌వైజర్ హైమావతి, మహిళా ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట



పోచారం మున్సిపల్ పాలకవర్గం, సిబ్బందిని సన్మానిస్తూ..



ఘట్‌కేసర్‌లో ఆశ వర్కర్లను సన్మానిస్తున్న చైర్ పర్సన్ పావనీయాదవ్, వైస్ చైర్మన్ మాధవరెడ్డి

మేడ్చల్‌రూరల్: బీఆర్ఎస్ ప్రభుత్వం, సీఎం కేసీఆర్ రాష్ట్రంలోని మహిళా సంక్షేమానికి పెద్దపీట వేశారని గుండ్లపోచంపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ మద్దుల లక్ష్మిశ్రీనివాస్‌రెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం మహిళా సంక్షేమ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలో వివిధ రంగాల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులను సన్మానించారు. డ్వాక్రా మహిళలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లకు ముగ్గుల పోటీలు, మ్యూజికల్ చైర్ వంటి ఇతర పోటీలు నిర్వహించగా విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. మున్సిపల్ కమిషనర్ రాములు, మహిళా కౌన్సిలర్లు రాజకుమారి సుధాకర్, అంతోనమ్మ, ఉద్యోగులు, సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాల పంపిణీ

గుండ్లపోచంపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం అందించిన పాఠ్య పుస్తకాలను మంగళవారం మున్సిపల్ చైర్‌పర్సన్ మద్దుల లక్ష్మిశ్రీనివాస్‌రెడ్డి అందజేశారు. ప్రభుత్వం పాఠశాలల్లో డిజిటల్ తరగతులు, మౌలిక వసతులు కల్పిస్తోందని అన్నారు. కౌన్సిలర్లు రాజకుమారిసుధాకర్, అంతోనమ్మ, హెచ్ఎం రంగాచారి, ఉపాధ్యాయులు గోపీనాథ్, రవికుమార్, ప్రేమ్‌కుమార్, అనిల్ ఉన్నారు.

రాష్ట్రంలో మహిళలకు సముచిత గౌరవం

ఘట్‌కేసర్: రాష్ట్రంలో మహిళలకు సముచిత స్థానం కల్పించామని చైర్‌పర్సన్ పావనీయాదవ్ అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో మంగళవారం నిర్వహించిన తెలంగాణ మహిళా సంక్షేమ దినోత్సవంలో వైస్ చైర్మన్ మాధవరెడ్డితో కలిసి ఆశ వర్కర్లు, ఆర్పీలు, కల్యాణ లక్ష్మీ లబ్ధిదారులు, మహిళా కౌన్సిలర్లను సన్మానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మహిళల రక్షణ కోసం షీటీమ్స్, కల్యాణలక్ష్మీ, ఆరోగ్యలక్ష్మీ, కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్, పోలీస్ శాఖలో మహిళా రిజర్వేషన్ అమలు చేసి ప్రోత్సహిస్తోందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు రమాదేవి, సంగీత, ఆంజనేయులుగౌడ్, అనురాధ, శశికళ, నరేశ్‌యాదవ్, జహంగీర్, రవీందర్, కోఆప్షన్ సభ్యులు బి.అరుణ, పి.అరుణ, మేనేజర్ అంజిరెడ్డి పాల్గొన్నారు.



గుండ్లపోచంపల్లిలో పలువురు మహిళలను సన్మానిస్తూ..

పోచారం మున్సిపల్ ఆఫీస్‌లో..

పోచారం: రాష్ట్ర అవతరణ దశాబ్ది దినోత్సవాల్లో భాగంగా మంగళవారం పోచారం మున్సిపల్ ఆఫీస్‌లో మహిళా సంక్షేమ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కంప్యూటర్ ఆపరేటర్ సరితకు పాలకవర్గంతో పాటు మున్సిపల్ సిబ్బంది సీమంతం నిర్వహించారు. అనంతరం మహిళలను పాలకవర్గం తెల్లని కండువాలతో సత్కరించింది.



నాగారం మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ చంద్రారెడ్డి, కమిషనర్ వాణీరెడ్డి

మహిళల సంక్షేమానికి ఎన్నో పథకాలు

కీసర: రాష్ట్ర ప్రభుత్వం మహిళల సంక్షేమానికి దేశంలోనే విప్లవాత్మక పథకాలను ప్రవేశపెట్టిందని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం నాగారం మున్సిపాలిటీ కార్యాలయంలో తెలంగాణ మహిళా సంక్షేమ దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఆశావర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఆర్‌పీలు, మున్సిపల్ మహిళా సిబ్బందిని ఘనంగా సత్కరించారు. వైస్ చైర్మన్ మల్లేష్‌యాదవ్, కమిషనర్ వాణీరెడ్డి, మేనేజర్ చంద్రశేఖర్, కో ఆప్షన్ సభ్యులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

చెరువులోని మట్టిని తరలిస్తున్న వారిపై కేసు

ఘట్‌కేసర్: ఏదులాబాద్ శ్రీలక్ష్మీనారాయణ చెరువులోని మట్టిని అక్రమంగా తరలిస్తున్న వారిపై ఘట్‌కేసర్ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. సీఐ అశోక్‌రెడ్డి వివరాలు ప్రకారం.. మండలంలోని ఏదులాబాద్ శ్రీలక్ష్మీనారాయణ చెరువు ఎఫ్‌టీఎల్ పరిధి బఫర్ జోన్‌లో అక్రమంగా మట్టిని తరలిస్తున్నారని మండల నీటి పారుదల శాఖ ఏఈ పరమేశ్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు విచారించగా కట్ట యేసురెడ్డి, రవీందర్‌రెడ్డి మట్టిని తరలిస్తున్నారని తేలింది. నీటి పారుదల శాఖ ఏఈ పరమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

కీసర: కుందన్‌పల్లి సమీపంలోని ఓ వ్యవసాయ క్షేత్రంలో పనిచేసే కడమంచి నర్సింహ(38) ఆర్థిక ఇబ్బందులతో సోమవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. కుందన్‌పల్లికి చెందిన మాజీ వార్డు సభ్యుడైన నర్సింహ గ్రామ సమీపంలో ఓ వ్యవసాయ పొలం కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. అప్పులు ఎక్కువై తీర్చే మార్గం లేక వ్యవసాయ పొలంలోని గదిలో తాడుతో ఉరివేసుకున్నాడు. పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

మోడల్ సిటీగా జవహర్‌నగర్

మేయర్ కావ్య

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని బీజేఆర్‌నగర్ 6వ డివిజన్‌లో భూగర్భ డ్రైనేజీ పనులను మేయర్ మేకల కావ్య, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్, కార్పొరేటర్ పల్లపు రవితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ కావ్య మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమ పథకాలతో సీఎం కేసీఆర్ సుపరిపాలన అందిస్తున్నారన్నారు. జవహర్‌నగర్‌లోని ప్రతి డివిజన్‌లో రూ.కోటికి పైగా అభివృద్ధి పనులు చేసినట్లు చెప్పారు. జవహర్‌నగర్‌ను మోడల్ సిటీగా మారుస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యురాలు పల్లపు ఉపేంద్ర, నాయకులు ప్రశాంత్, ధనలక్ష్మీ, కళావతి, లక్ష్మీ, జయమ్మ, సావిత్రి, వాణి, రవీందర్‌గౌడ్, నర్సింహ, శ్రీహరియాదవ్, శంకర్ పాల్గొన్నారు.



డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న మేయర్ కావ్య, డిప్యూటీ మేయర్ శ్రీనివాస్